క్లుప్తంగా

చలానా బకాయిలు చెల్లించాలి



మంగళగిరి (తాడేపల్లి రూరల్): మంగళగిరి పట్టణ పరిధిలోని వాహనదారులు చలానా బకాయిలను సకాలంలో చెల్లించాలని, లేకుంటే వాహనాలు సీజ్ చేస్తామని మంగళగిరి పట్టణ సీఐ వినోద్ కుమార్ సూచించారు. పట్టణ పరిధిలోని గౌతమ బుద్ధ రోడ్డులో వాహనదారులకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ట్రాఫిక్ ఉల్లంఘనలకు సంబంధించి విధించిన చలానాలు రెండుగానీ, అంతకంటే ఎక్కువగానీ పెండింగ్‌లో ఉంటే ఆ వాహనాలు సీజ్ చేస్తామని పేర్కొన్నారు. తిరిగి వాటిని పొందాలంటే చలానాలు చెల్లించి కోర్టు ద్వారా మాత్రమే తీసుకునే వీలుంటుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. నిబంధనలు పాటించాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ ఎస్ఐలు నాయక్, హరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

పింఛను లబ్ధిదారుల వివరాల పరిశీలన



ఫిరంగిపురం: మండలంలోని ఏడు గ్రామాల్లో గురువారం పింఛను లబ్ధిదారుల వివరాలను జిల్లాస్థాయి వైద్యాధికారుల బృంద సభ్యులు పరిశీలించారు. లబ్ధిదారుల ఆరోగ్య స్థితిగతులు, వాడుతున్న మందులు, సంబంధిత సర్టిఫికెట్లు పరిశీలించారు. 30 మంది వివరాలను పరిశీలించినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్లు తెలిపారు. పరిశీలకులలో వైద్యులు ప్రియాంక, హర్ష, ఫరీనాబేగం, ఆయా గ్రామాల సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



తాడేపల్లి రూరల్: సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దుగ్గిరాల గ్రామంలోని రామాలయం సెంటర్ వద్ద డీవైఎఫ్ఐ మహిళా సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి జెట్టి బాలరాజు మాట్లాడుతూ.. సంక్రాంతి సందర్భంగా మహిళలకు ముగ్గులు, పాటలు, మ్యూజికల్ చైర్స్, రన్నింగ్, స్కిప్పింగ్, టగ్ ఆఫ్ వార్, క్విజ్ తదితర పోటీలు నిర్వహించామన్నారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సీహెచ్ శ్రీనివాసరావు, దేవర పామిరెడ్డి, సీహెచ్ పోతురాజు, మంచికలపూడిలో నిర్వహించిన పోటీల్లో వై. స్టాలిన్, బ్రహ్మేశ్వరరావు, టి.యామిని, వై.శ్రావణి, వి.సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

కారును ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు



మంగళగిరి (తాడేపల్లి రూరల్) : మంగళగిరి మండలం ఎర్రబాలెం దగ్గర గురువారం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారును ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో కారులో ప్రయాణిస్తున్న మహిళకు గాయాలు అయ్యాయి. బాధితురాలు ఎం. సౌమ్య తెలిపిన వివరాల ప్రకారం.. తమది వైకుంఠపురమని, తండ్రి మంగళగిరిలో వ్యాపారం చేస్తుంటారని తెలిపారు. ఆయన్ను కలిసేందుకు గురువారం ఉదయం 9 గంటల సమయంలో వైకుంఠపురంలోని తాత, అమ్మమ్మతో కలిసి కారులో బయలుదేరినట్లు చెప్పారు. తాత డ్రైవింగ్ చేస్తున్నారని, సుమారు ఉదయం 10 గంటల సమయంలో కృష్ణాయపాలెం, యర్రబాలెం ప్రాంతంలో ఉన్న టిడ్కో గృహ సముదాయాల వద్దకు వచ్చే సరికి ఎదురుగా ఆర్టీసీ బస్సు అతివేగంగా వచ్చి కారును ఢీకొట్టిందన్నారు. కారు ముందు భాగం ధ్వంసమైందని, తనకు గాయాలు కావడంతో ఆసుపత్రిలో చేర్పించారన్నారు. మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశామని పేర్కొన్నారు.

23న లైవ్ మ్యూజిక్

మంగళగిరి (తాడేపల్లి రూరల్): ఈ నెల 23వ తేదీన లైవ్ మ్యూజిక్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మంగళగిరి టీడీపీ కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరుతో 23వ తేదీ సాయంత్రం 6 గంటల నుంచి ఎన్ఆర్ఐ జంక్షన్ వద్ద గౌతమ బుద్ధ రోడ్డులోని మియామి కేఫ్ పక్కన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.

రోడ్డెక్కితే పద్మవ్యూహమే!

మంగళగిరి నియోజకవర్గ కేంద్రమైన పట్టణంలో ట్రాఫిక్ సమస్య పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. మండల పరిధితోపాటు తాడేపల్లి, దుగ్గిరాల గ్రామాలలో నుంచి ప్రజలు నిత్యం మండల కేంద్రమైన మంగళగిరికి వస్తుంటారు. ఇక్కడ వివిధ పనుల కోసం రాకపోకలు సాగిస్తుంటారు. మంగళగిరి పట్టణ పరిధిలోని ప్రధాన రహదారి అయిన గౌతమ బుద్ధరోడ్, మెయిన్ బజార్ నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఈ కారణంగా పాత బస్టాండ్, కొత్త బస్టాండ్ ప్రాంతాల్లో రాకపోకలకు బాటసారులు, వాహనచోదకులు పడరాని పాట్లు పడుతున్నారు.

- ఇష్టారాజ్యంగా వాహనాల పార్కింగ్
- ప్రధాన రహదారుల్లో రాకపోకలకు కష్టాలు



గౌతమ బుద్ధ రోడ్డులో అడ్డదిడ్డంగా వెళుతున్న వాహనదారులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్) : పాత బస్టాండ్, కొత్త బస్టాండ్, మిద్దె సెంటర్, పూలమార్కెట్ సెంటర్, సాధు సోడా సెంటర్, గాలిగోపురం సెంటర్లలో రోడ్లపై వ్యాపారాలు సాగిస్తున్నారు. ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్డుపై పార్క్ చేసి ఉండడంతో జనంతో ఆ ప్రాంతాలు సంతను తలపిస్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో సమస్య మరింత జటిలంగా మారింది. ఇక ఉదయం, సాయంత్రం సమయాల్లో ట్రాఫిక్ పద్మవ్యూహంలా మారుతోంది. పట్టణానికి ప్రధాన రోడ్డు అయిన మెయిన్ బజార్ బండ్లు, కూలీలతో వచ్చే ట్రాఫిక్ సమస్యలు ఇక చెప్పే పనే లేదు. రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల వినియోగంతో ట్రాఫిక్ కష్టాలు అంతకంతకు పెరుగుతున్నాయి. పెరుగుతున్న జనాభా, వాహనాల వినియోగానికి తగ్గట్లు రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.



నిత్యం రద్దీగా ఉండే పాత బస్టాండ్ రహదారి

ట్రాఫిక్ ఎస్ఐ కేటాయింపుపై నిర్లక్ష్యం

మంగళగిరి నియోజకవర్గ కేంద్రం, రాజధానిలో ప్రధాన పట్టణమైన మంగళగిరి పోలీస్‌స్టేషన్‌కి ట్రాఫిక్ ఎస్ఐను కేటాయించలేదు. గతంలో మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌ను ఏర్పాటు చేసి ఓ ఎస్ఐని, కొంత మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ఇప్పుడు ఆ స్టేషన్‌ను అవసరాలకు వాడుకోవడం తప్ప ట్రాఫిక్‌కు సంబంధించిన ఎటువంటి సిబ్బంది లేరు. దీంతో సమస్య ఇంకా పెరిగింది. ఉన్న పోలీస్ సిబ్బందినే ట్రాఫిక్‌కి కేటాయిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ ఎస్ఐను, సిబ్బందిని కేటాయించి సమస్యను పరిష్కరించాలని మంగళగిరి ప్రజలు కోరుతున్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



మంగళగిరి పట్టణ పరిధిలో గురువారం ఓ పక్క పోలీసులు వాహనదారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సమయంలోనే గౌతమ బుద్ధ రోడ్డులో ఓ వాహనదారుడిని అతివేగంగా వస్తున్న ఆటో ఢీకొట్టింది. ద్విచక్రవాహనదారుడు అక్కడికక్కడే పడిపోయాడు. విధులు నిర్వహిస్తున్న పోలీసులు అతడికి సహాయం అందించారు. ప్రథమ చికిత్స చేశారు. త్రుటిలో అతడికి పెను ప్రమాదం తప్పింది.

అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి



మంగళగిరిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. మెయిన్‌బజార్‌లో వస్తే ఇబ్బందులు పడాల్సిందే. ఈ సమస్యపై అధికారులు దృష్టి సారించాలి. వాహనదారులు రోడ్డుపై అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– ఆరంజ్ ఆంజనేయులు, మంగళగిరి

సాయంత్రమైతే వెళ్లలేని పరిస్థితి



సాయంత్రం వేళల్లో కుటుంబంతో బయటకు వస్తే చాలు మెయిన్‌బజార్‌లో గంటల తరబడి ట్రాఫిక్‌లో ఇరుక్కుపోవాల్సి వస్తోంది. అధిక లోడ్ వేసుకొచ్చిన వాహనాలు ఎప్పుడు పడితే అప్పుడు మెయిన్‌బజార్‌లోకి ప్రవేశిస్తున్నాయి. ట్రాఫిక్‌కు ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి.

– కృష్ణ, పాత మంగళగిరి

బాధ్యతగా మెలగాలి



ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించాలి. ఇది ఒక్క పోలీసులతోనే సాధ్యం కాదు. ప్రతి పౌరుడు ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా వ్యవహరించాలి. ఆ దిశగా ప్రజలను చైతన్యపరుస్తున్నాం. ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులను నియమిస్తున్నాం. ఆటోస్టాండ్‌లను ఏర్పాటు చేశాం. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

– పట్టణ సీఐ వినోద్‌కుమార్

సర్పంచుల సమస్యల పరిష్కారానికి వినతి



కృష్ణతేజకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తాడేపల్లి రూరల్: ఆంధ్రప్రదేశ్‌లోని సర్పంచుల సమస్యలను పరిష్కరించాలని ఏపీ సర్పంచుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు కోరారు. ఈ మేరకు గురువారం ఏపీ పంచాయతీరాజ్ మరియు గ్రామీణ అభివృద్ధి సంక్షేమ శాఖ కమిషనర్ మైలవరపు కృష్ణతేజను తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా పాపారావు, అఖిల భారత పంచాయతీ పరిషత్ (ఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీలకు రిజిస్ట్రేషన్ శాఖ నుంచి రావాల్సిన సర్‌చార్జీలను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు. కడప జిల్లాలో కుడా నుంచి పంచాయతీలకు నిధులివ్వాలని తెలిపారు. పెండింగ్ గౌరవ వేతనాలను రిలీజ్ చేయాలని వినతిపత్రం అందజేశామన్నారు. తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడప జిల్లా సర్పంచుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కొనిరెడ్డి శివ చంద్రారెడ్డి, సురేష్ వర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ అల్లా బక్షు తదితరులు పాల్గొన్నారు.

మానికొండ ముత్యాలరావుకు ఘన నివాళి



ముత్యాలరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

తాడేపల్లి రూరల్: కమ్యూనిస్టు నేత మానికొండ ముత్యాలరావు వర్ధంతి సభను గురువారం తాడేపల్లి సీపీఐ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా నేతలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మంగళగిరి నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ.. దేశంలో సామాన్యులకు న్యాయం జరగడం లేదన్నారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ శక్తుల నుంచి శ్రామిక కర్షక వర్గం చేతుల్లోకి రాజ్యాధికారం వచ్చినప్పుడే అందరికీ న్యాయం జరుగుతుందన్నారు. నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడే పార్టీ తమదని పేర్కొన్నారు. మానికొండ ముత్యాలరావు పేదల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన వ్యక్తి అని కొనియాడారు. పార్టీ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య మాట్లాడుతూ.. పేదల పక్షాన సీపీఐ నిలుస్తూ ఎన్నో భూ పోరాటాలు, ఇళ్ల స్థలాల కోసం ఉద్యమాలు చేసిందన్నారు. మానికొండ ముత్యాలరావు ఉద్యమ స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడతామని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ప్రాంత సహాయ కార్యదర్శి తుడిమెల్ల వెంకటయ్య, మంగళగిరి మండల కార్యదర్శి జాలాది జాన్‌బాబు, సీనియర్ నాయకులు గుంటక సాంబిరెడ్డి, మానికొండ డాంగే, గుద్దంటి శివ, రామారావు, షేక్ ఖాసిం, సాయి, ప్రశాంత్, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సాగర్ నీటి విడుదల

మిర్చి పంటకు నీటి తడులు వేస్తున్న అన్నదాతలు



సాగర్ కాల్వలో పారుతున్న నీరు

తాడికొండ: గత వారం రోజులుగా సాగర్ కాల్వలకు నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో రైతులు తమ పంట పొలాలకు నీటి తడులు వేసుకునే ప్రక్రియ చేపట్టారు. తాడికొండ మండలం పరిధిలోని రావెల, బండారుపల్లి, ఫణిదరం, గరికపాడు, దామరపల్లి, పొన్నెకల్లు, పాములపాడు, బేజాత్పురం, మోతడక, నిడుముక్కల, ముక్కామల, లచ్చన్నగుడిపూడి గ్రామాల పరిధిలో ఈ ఏడాది మిర్చి సాగు చేస్తున్న రైతులకు ప్రస్తుత పరిస్థితుల్లో ఇది ప్రయోజనకరంగా మారింది. ఇప్పటికే 50 శాతం పంట పొలాలకు రైతులు నీటి తడులు అందించారు. శివారు ప్రాంతాల్లో ఉన్న పంటలన్నింటికీ నీరు పెట్టడం పూర్తయ్యేంతవరకు నీటి విడుదల కొనసాగించాలని పలువురు రైతులు కోరుతున్నారు. 2 నెలలుగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుతం రైతులకు నీటి అవసరాలు ఉన్నాయి. దీనిని దృష్టిలో ఉంచుకొని సాగర్ కాల్వలకు నీటి విడుదలను కొనసాగించాలని అన్నదాతలు కోరుతున్నారు.

సీపీఎం కరపత్రాలు పంపిణీ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లి రూరల్: రైతుల సమస్యలపై విజయవాడలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. గురువారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో సంబంధిత కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి కాజా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. ఎన్నికల వాగ్దానాలలో రైతులకు పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తానని కూటమి నాయకులు చెప్పారన్నారు. ప్రభుత్వం ఏర్పాటయ్యాక దాన్ని అమలు చేయలేదని గుర్తుచేశారు. వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని డిమాండ్ చేవారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని పేర్కొన్నారు. రైతాంగం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం అందర్నీ ఆదుకోవాలని పేర్కొన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీలు కొనసాగించాలని, ఉచిత పంటల బీమా కొనసాగించాలని అన్నారు. పంట కాలువలలో పూడిక, తూటికాడ, గుర్రపు డెక్క తొలగించాలని తెలిపారు. శుభ్రం చేసి ఆధునికీకరించాలన్నారు. పాడి రైతులకు ఇతర రాష్ట్రాలలో ఇస్తున్న విధంగా లీటరుకు రూ.ఐదు బోనస్ అదనంగా ఇవ్వాలన్నారు. తాడేపల్లి మండలంలో అధికంగా భూమిని సాగు చేస్తున్న కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకు రుణాలు, సబ్సిడీలు అందించాలని కోరారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు విజయవాడ ధర్నా చౌక్‌లో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు అమ్మిశెట్టి రంగారావు, శివారెడ్డి, ఎనుముల సాంబయ్య, బాకీ శ్రీనివాసరావు, బద్రి వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న బూరుగ వెంకటేశ్వరరావు

తాడేపల్లి రూరల్: ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సీపీఎం తాడేపల్లి పట్టణ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వరరావు హెచ్చరించారు. గురువారం తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సమస్య పరిష్కారం కోసం ఐక్య పోరాటాలే మార్గమని అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కార్మికులకు నారా లోకేష్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని అన్నారు. కార్మికుల సమస్యను పరిష్కరించే దిశగా జోక్యం చేసుకుని నష్టపరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ.. కార్మికుల శ్రమ దోచుకున్న యాజమాన్యం నష్ట పరిహారాన్ని ఇవ్వడంలో నిర్లక్ష్యంగా ఉందన్నారు. కార్మిక కుటుంబాలను ఇబ్బంది పెడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దీక్షలలో ఎస్కే ఇమాంబీ, దానమ్మ, శాంతమ్మ, రమణ తదితరులు కూర్చొన్నారు. పోరాట కన్వీనర్ కూరపాటి స్టీవెన్, బి.సూర్యప్రకాష్, గురవయ్య, డి.నాగేశ్వరరావు, జయలక్ష్మి, శారమ్మ, రమదేవి, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

మురుగు కదలక.. సమస్య తీరక..



ప్రాతూరు కుంచనపల్లి రోడ్డులో కాలువలో కదలని మురుగు నీరు

తాడేపల్లి రూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో తాడేపల్లి రూరల్ బైపాస్ రోడ్డులోని కుంచనపల్లి ప్రాతూరు రోడ్డులో మురుగు పారక కాలువల్లో చెత్త కూడా పేరుకుపోతోంది. ఈ ప్రాంతం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. కార్పొరేషన్ అధికారులు మురుగు నీటి సమస్యలపై దృష్టి సారించడం లేదు. ప్రధాన రహదారులతో పాటు ఇతర ప్రాంతాల్లో మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. కొన్నిచోట్ల డ్రైనేజీ కాలువలు నిర్మించినా సక్రమంగా చెత్త తీయనికారణంగా బయటకు వెళ్లే మార్గం లేకుండాపోయింది. ప్రధాన రహదారుల్లోని డ్రైనేజీ కాలువల్లో నాలుగు అడుగుల మేర మురుగునీరు నిల్వ ఉంటోంది. కొన్నిచోట్ల కాలువ నుంచి పొంగుతుండటంతో వాహనచోదకులు, ప్రజలు అవస్థలు పడుతున్నారు. అక్కడక్కడ పంట పొలాల్లోకి, ఖాళీ స్థలాల్లోకి మురుగునీరు ప్రవహిస్తోంది. దీంతో ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ప్రాతూరు, కుంచనపల్లి రహదారిలో ఇరువైపులా ఉన్న బహుళ అంతస్తుల భవనాల్లోని ప్రజలు తమ ఇబ్బందులపై ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా కనీస స్పందన లేదని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విజేతలకు బహుమతులు ప్రదానం



బహుమతులు అందిస్తున్న వేణుగోపాల్, మాధవరావు



పోటీలో పాల్గొన్న చిన్నారులు

ఫిరంగిపురం: మండలంలోని పొనుగుపాడు గ్రామంలో సంక్రాంతి సంబరాలు సందర్భంగా గురువారం పలురకాల ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో 150 మంది వరకు బాలబాలికలు పాల్గొన్నారు. వారికి ముగ్గులపోటీ, మ్యూజికల్ చైర్స్, బైక్‌స్లో, రన్నింగ్, డాన్స్, స్పూన్‌పోటీ, స్కిప్పింగ్ వంటి పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి హైకోర్టు లాయర్ టి.వేణుగోపాల్, మిత్ర ఫౌండేషన్ కమిటీ చైర్మన్ ఎ. మాధవరావులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎ. వెంకట్రావు, యామిని బ్రహ్మం, షేక్.జవహర్, షేక్.మస్తాన్ వలి, కె.బాబి, కె.భార్గవ్, రామకిరణ్, తేజ, చంద్రశేఖర్, కె.రాజేష్, కార్తికేయ శ్రీనివాసరావు, త్రివేణి, తెలుగు యువత నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఒత్తిడి దూరం



క్రీడా పోటీల్లో పాల్గొన్న చిన్నారులు



బహుమతులు అందజేస్తున్న అతిథులు

తాడికొండ: చిన్నారుల్లో మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు క్రీడలు ఎంతగానో దోహదం చేస్తాయని ఫణిదరం గ్రామ సర్పంచ్ కర్నాటి బాల కోటేశ్వరరావు అన్నారు. గురువారం తాడికొండ మండలం ఫణిదరం గ్రామంలో చైల్డ్ రైట్స్ అడ్వకసీ ఫౌండేషన్– క్రాప్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలమేళా ఆటల పోటీలలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఇలాంటి పోటీలు ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈ సందర్భంగా బాల బాలికలకు లెమన్ అండ్ స్పూన్, లక్కీ సర్కిల్, పిరమిడ్, బెలూన్ బ్లోయింగ్, సర్కిల్‌లో బెలూన్ గేమ్, సర్కిల్ ఇన్ బాల్ గేమ్ వంటి పలు ఆటలు ఆడించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి తబిత, శాంతి, మాజీ సర్పంచ్ కర్నాటి విశ్వేశ్వరరావు, సాంబశివరావు, క్రాప్ జిల్లా కోఆర్డినేటర్ వెంకట్, జయరాజు, సౌభాగ్యం, అంగన్‌వాడీలు, స్థానికులు పాల్గొన్నారు.

కోడి పందేలు ఆడుతున్న ఇద్దరు అరెస్టు

తాడికొండ: నిడుముక్కల డొంకలో కోడి పందేలు వేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ కె. వాసు తెలిపారు. నిడుముక్కల నుంచి లచ్చన్నగుడిపూడి వెళ్లే డొంకలో కోడి పందేలు వేస్తున్నారని వచ్చిన సమాచారం మేరకు దాడులు నిర్వహించారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. రెండు కోళ్లు, స్వల్ప నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేశారు.

కమీషన్ డబ్బు అడిగితే దాడి చేశారని ఫిర్యాదు

తాడికొండ: పొలం విక్రయించిన కమీషన్ డబ్బు అడిగితే నిడుముక్కల గ్రామానికి చెందిన వడ్లమూడి సాంబశివరావు తనను కులం పేరుతో దూషించి దాడి చేశారని బాధితుడు మోతడకకి చెందిన పల్లపాటి రాజేష్ చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడికొండ సీఐ కె. వాసు గురువారం తెలిపారు.

ఎంబీబీఎస్ విద్యార్థినికి సహాయం



తాడేపల్లి రూరల్ : మెడిసిన్ చదువుతున్న ఓ విద్యార్థినికి దాతలు చేయూత అందించారు. విజయవాడ సిద్దార్థ మెడికల్ కాలేజీలో రెండవ సంవత్సరం మెడిసిన్ చదువుతున్న మదీరు వర్షకు తాడేపల్లిలోని రామ్ చారిటబుల్ ట్రస్ట్, దాతలు ఊడ శివన్నారాయణ, సమ్మెట నాగ కిరణ్‌ల సహకారంతో గురువారం ఆర్థిక సహాయం అందజేశారు. రూ.1.10 లక్షల మేరకు చెక్కును అందజేసినట్లు ట్రస్ట్ ఫౌండర్ డాక్టర్ పలగాని శ్రీనివాసరావు వెల్లడించారు. సహాయమందించిన దాతలకు విద్యార్థిని వర్ష, ఆమె కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

తాడికొండ: తాడికొండ మండలం రాయపూడి గ్రామంలో దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు. శీతాకాలం నేపథ్యంలో దోమలు పెరిగి రాత్రి సమయంలో ఇబ్బంది పడకుండా ఫాగింగ్ చేస్తున్నట్లు తెలిపారు.